క్లుప్తంగా

ఘనంగా బ్రెయిలీ జయంతి



నారాయణపేట: లూయి బ్రెయిలీ జయంతిని జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారి జయ మాట్లాడుతూ.. బ్రెయిలీని స్మరించుకుంటూ ఆయన అంధులకు అందించిన సేవను కొనియాడారు. అంధులకోసం లిపిని కనుగొని ఆదర్శంగా నిలిచారన్నారు. బ్రెయిలీ అందించిన లిపి ద్వారా ఎంతోమంది అంధులో ఆదర్శవంతులుగా తీర్చిదిద్దబడ్డారన్నారు. అలాగే సిబ్బందితోపాటు అంధులంతా కలిసి కేక్‌కట్ చేశారు.

వరి క్వింటా రూ.2,466

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం వరి (సోనారకం) క్వింటా గరిష్ఠంగా రూ.2,466, కనిష్ఠంగా రూ.1,500 ధర పలికింది. అలాగే ఎర్ర కంది రూ.8,409–రూ.7,088, తెల్ల కంది గరిష్ఠంగా రూ.8,559, కనిష్ఠంగా రూ.6,600 ధరలు లభించాయి.

పల్లె దవాఖాన ప్రారంభం

మద్దూరు: మండలంలోని జాదరావుపల్లి, రెనివట్లలో కేంద్ర నిధులతో నిర్మించిన పల్లె దవాఖానాలను మంగళవారం ఎంపీ డీకే అరుణ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆస్పత్రిలో తిరిగి సౌకర్యాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఐదు నుంచి ఆరు గ్రామాలకు కలిపి పల్లె దవఖానా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

కృష్ణా: మండల కేంద్రంలో ఈ నెల 13నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో దెబ్బతిన్న బీటీరోడ్డు మరమ్మతు పనులను మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మహాదేవ్ మాట్లాడుతూ.. రోడ్డు గుంతలమయంగా మారిందని, దానికి మరమ్మతుచేయించాలని రెండురోజుల క్రితం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజప్పగౌడ, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల ఇరుముడి

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని వల్లంపల్లి సమీపంలోని శబరి పీఠం సన్నిధానంలో మంగళవారం గురు స్వాములు కాకర్ల భీమయ్య ఆధ్వర్యంలో స్వాములకు ఇరుముడి వైభవంగా చేపట్టారు. అంతకుముందు శబరి పీఠం సన్నిధానంలోని వారు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శబరిమలై అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు వాహనాలలో తరలి వెళ్లారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మరికల్: మండల కేంద్రానికి చెందిన దళిత మోర్చా రాష్ట్ర నాయకులు నారా కొండయ్య గత ఏడాది మృతి చెందారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు బీజేపీ నాయకులు తమవంతుగా రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి పార్టీ ఆసరాగా ఉంటుందని అభయం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నర్సన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, రమేష్, రాజేష్, వేణు, బాల్‌రాజు, నాగేష్ పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మతల్లి జాతర



దామరగిద్ద: మండల కేంద్రంలో మైసమ్మతల్లి జాతర భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు ప్రత్యేక వంట కాలతో చేసిన నైవేద్యాలను అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎరువుల పంపిణీ

దామరగిద్ద: నేలలో నిల్వ ఉన్న భాస్వరం ఎరువును కరిగించి మొక్కకు అందించే బ్యాక్టీరియా జీవ ఎరువు ప్యాకెట్లు సబ్సిడీ ధరకు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి మణిచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు పూర్తి వివరాలకు ఏఈఓలను సంప్రదించాలని కోరారు.

కొత్తపల్లి: నేలను సారవంతం చేసేందుకు సబ్సిడీపై ఎరువులను అందిస్తున్నట్లు ఏఈఓలు రమేష్, రామకృష్ణ తెలియజేశారు. కావాల్సిన రైతులు సమీపంలోని రైతు వేదికలో పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకెళ్లి కొనుగోలు చేసుకోవాలన్నారు.

గడువులోగా అనుమతులు ఇవ్వాలి

• కలెక్టర్ సిక్తా పట్నాయక్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: జిల్లా పరిశ్రమల శాఖకు దరఖాస్తు చేసుకున్న వారికి నిర్ణీత గడువులోగా అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. నెల నెలా క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. చివరగా టీజీ ఐపాస్ సమావేశం ఎప్పుడు జరిగిందని సంబంధిత అధికారిని అడిగి తెలుసుకున్నారు. సమావేశపు ఎజెండాలోని వివిధ అంశాలపై పరిశ్రమల శాఖ జీఎం మహేశ్వర్ కలెక్టర్‌కు వివరించారు. టీజీ ఐపాస్ కింద గత నవంబరు 7నుంచి ఈ నెల 6వరకు పరిశ్రమలకు 14 అనుమతుల కోసం సంబంధిత శాఖలలో దరఖాస్తు చేసుకోగా వాటిలో 9అనుమతులు మంజూరయ్యాయని, 2 ప్రాసెస్‌లో ఉన్నాయని, ఒకటి తిరస్కరించబడిందని, మిగతా 2 అభ్యంతరాలు ఉన్నాయని జీఎం తెలిపారు. అలాగే టీ ప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు చెందిన 17 దరఖాస్తుదారులకు సబ్సిడీ మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఆర్డీఓ మేఘాగాంధీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి కిరణ్, ఐపీఓ నర్సింగ్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, లీడ్ బ్యాంకు మేనేజర్ విజయ్‌కుమార్, సబ్ రిజిస్ట్రార్ రాంజీ, భూ గర్భజల శాఖ సీనియర్ అసిస్టెంట్ చైతన్యకుమార్, అగ్నిమాపక శాఖ అధికారి సురేష్‌రెడ్డి, మైనింగ్ శాఖ ప్రతాప్ రెడ్డి, కార్మికశాఖ అధికారి తిలక్ పాల్గొన్నారు.

డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష..

డిస్ట్రిక్ట్ ఎక్స్ పోర్ట్ యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ యాక్షన్ ప్లాన్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా నుంచి విదేశాలకు ఎక్స్‌పోర్ట్ చేసే వివిధ ఉత్పత్తులపై చర్చించారు. జిల్లాలో ప్రధానంగా ధాన్యం, పత్తి, హ్యాండ్లూమ్ (కాటన్ సిల్క్) ఎక్స్ పోర్ట్ చేసేందుకు నిర్ణయించారు. అందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్ మాట్లాడుతూ.. జిల్లాలో వంద ఎకరాలలో మునగ ఆకు సాగు చేస్తున్నారని, దాని పొడిని ఎక్స్‌పోర్ట్ చేసే అవకాశం ఉంటే పరిశీలించాలని కోరారు. ఒక్కో జిల్లానుంచి ఒక్కో ఉత్పత్తిని ఎక్స్‌పోర్ట్ చేసే అవకాశం ఉందని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మహేశ్వర్ తెలిపారు. జిల్లాలో సీతాఫలాల ప్రాసెసింగ్ జరుగుతుందని ఆ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని నాబార్డు అధికారి షణ్ముఖచారి వీసీ ద్వారా కలెక్టర్‌ను కోరారు.

గ్యారంటీ చట్టం అమలు చేయాలి



పేటలో మాట్లాడుతున్న యాదగిరి

నారాయణపేట రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యవసాయ రంగ అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న రైతుల కోసం మద్దతు ధరల గ్యారంటీ చట్టం అమలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం భగత్ సింగ్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు.. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వెంటనే స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా మద్దతు ధరల గ్యారంటీ చట్టాలు చేయాలన్నారు. ఈ నెల 9న జిల్లా కేంద్రంలో నిర్వహించే భారీ ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని రైతులను కోరారు. భగవంతు, వెంకట్ రెడ్డి, చెన్నారెడ్డి, కృష్ణ, నర్సింహులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

కోస్గి: రైతుల కోసం మద్దతు ధరల గ్యారంటీ చట్టం అమలు చేయాలని కోరుతూ.. సంఘం జాతీయ కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్లకు సంఘం నాయకులు వినతి పత్రాలు అందజేశారు. నాయకులు నాయకులు చెన్నారెడ్డి, కొండ నర్సింహులు, బోడ కిష్టప్ప, కాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణా: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని అఖిల భారత ఐక్య రైతుసంఘం నాయకులు లక్ష్మణ్, ఆనంద్ డిమాండ్ చేశారు. అంతకుముందు ఈ నెల 9న ఇండియా రైతు డిమాండ్ డేను రైతులు విజయవంతం చేయాలని కోరుతూ మండలంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు తిప్పయ్య, బస్వరాజ్, తాయప్ప, శివప్ప, మైబు, మహదేవ్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



కృష్ణా: ప్రయాణికులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికిల్స్ ఇన్స్పెక్టర్ రఘుబాబు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీచేయడంతోపాటు ప్రయాణికులకు పలు సూచనలు అందజేశారు. ప్రయాణికులు సీట్‌బెల్టు, హెల్మెట్ ధరించాలని, నియమిత వేగంతో ప్రయాణించాలన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రయాణికులకు అవగాహన చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మక్తల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులకు మాయమాటలు చెప్పి మోసం చేసిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. రైతులను మోసం చేసిన సీఎం రేవంత్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏమాత్రం నేరవేర్చడం లేదని, ఆరు గ్యారంటీల కథ ముగిసిందన్నారు. రైతులకు న్యాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట మార్చడం ఎంత వరకు సమంజసమని అన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం లేకుండా పోయిందన్నారు. రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళన చేపడుతామన్నారు. అనంతరం తహసీల్దార్ సతీష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాగౌడ్, నాయకులు రాజుల ఆశిరెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, రాజేష్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, రాములు, మొగులప్ప, చిన్న హన్మంతు, తిరుమలేష్‌గౌడ్, నారాయణరెడ్డి, తిరుపతయ్య, శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాగనూర్: ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ఈ నెల 10న ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుంజనూర్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అప్రోజ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 18వేలు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. శాంతమ్మ, సుగుణ, పార్వతమ్మ, ఆనంతమ్మ, గౌరమ్మ, పద్మ, అనురాధ పాల్గొన్నారు.

అబాకస్ విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీ డీకే అరుణ

నారాయణపేట రూరల్: గత నెలలో మహారాష్ట్ర పూణే నగరంలో నిర్వహించిన 7వ జాతీయ, 14వ అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అభినందించారు. అనంతరం వారు పొందిన బహుమతులు, ప్రశంసా పత్రాలను చూసి అభినందించారు. భవిష్యత్‌లో జిల్లా పేరును అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల పేరెంట్స్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



మరికల్: మండలంలోని తీలేర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని జ్యోతి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబర్చడంతో మంగళవారం హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ మేరకు.. హెచ్‌ఎం మాట్లాడుతూ.. తీలేర్ ప్రభుత్వ పాఠశాల నుంచి సైన్స్ పెయిర్‌లోనే కాకుండా చిత్రలేఖనం, వ్యాసరచన, కూచిపూడి, భారత నాట్యంలో రాణించేందుకు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు మండల కమిటీ ఎన్నిక

మాగనూర్: మున్నూరుకాపు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దొడ్ల అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాఘునాథరెడ్డి, కార్యదర్శిగా నాగులు రెడ్డి, మందిపల్లి అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ప్రహ్లాద్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కో–శాధికారిగా నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజారెడ్డిని ఎనుకున్నారు. శివరాంరెడ్డి, రాఘుపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి



ధన్వాడలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మరికల్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి మహేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ బీసీలకు 42శాతం స్థానిక సంస్థలలోను రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన ఇప్పుడు బీసీలను విస్మరించడం తగదన్నారు. అనంతరం తహసీల్దార్ జమీల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. నర్సన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, మహేందర్, రాజేష్, రమేష్, వెంకటేష్, రామేశ్వర్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ధన్వాడ: కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని తెలంగాణలో 55శాతం జనాభా ఉన్న బీసీలకు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తహసీల్దార్ సింధుజాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంచంద్రయ్య, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, నాయకులు ఉమేష్, ఉదయభాను, వెంకటేష్, రాజుసాగర్ పాల్గొన్నారు.

డీఆర్‌డీఓకు వినతి

ఊట్కూరు: మండలంలోని తిప్పరాస్‌పల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల్లోకి తీసుకోవాలని మంగళవారం సీఐటీయూ నాయకులు భీంశప్ప డీఆర్‌డీఓ మొగులప్పకు వినతిపత్రం అందజేశారు. నాయకులు రమేష్, కృష్ణ, నర్సింహులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఎడ్యుకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు

మద్దూరు: మండలంలోని పెదిరిపాడ్ ఉన్నత పాఠశాలకు విద్యారంగంలో విశేష కృషి చేసినందుకుగాను హైదరాబాద్‌లో మంగళవారం హైబీజ్ టీవీ వారు ఎడ్యుకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డును పాఠశాల హెచ్‌ఎం బాలకిష్టప్ప, వారి ఉపాధ్యాయ బృందం అవార్డును అందుకున్నారు. ఈ మేరకు.. విద్యారంగంలో సంస్థలు చేస్తున్న కృషిని గుర్తించి ఇలాంటి అవార్డులు ఇవ్వడం గప్ప విషయమని శాంత బయోటిక్ ఎండీ వరప్రసాద్‌రెడ్డి కొనియాడారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి



నర్వలో హెచ్‌ఎంల సమావేశంలో పాల్గొన్న ఎంఈఓ రామకృష్ణ



మాగనూర్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ అనిల్‌గౌడ్

నర్వ: పభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ రామకృష్ణ సూచించారు. మంగళవారం ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు.. పాఠశాలలో పరిశుభ్రమైన పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు ఈ కమిటీల ఏర్పాటు తప్పనిసరి అన్నారు. తల్లిదండ్రుల సమావేశాలను తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. సమయపాలనతోపాటు హాజరుశాతాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సూరం వెంకటేష్, దామోదర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఉస్మాన్, నరేష్, శిరీష పాల్గొన్నారు.

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ఇన్‌చార్జి ఎంఈఓ అనిల్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంతో సమావేశం ఏర్పాటుచేసి పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన నిర్వహణ, ప్రతి పాఠశాల వారిగా సమగ్ర సమాచార సేకరణ, ఫుడ్ కమిటీ ఏర్పాటు విధుల గురించి ఎంఈఓ, హెచ్‌ఎంలకు దిశానిర్దేశం చేశారు. అలాగే అకాడమిక్ అంశాలకు సంబంధించిన బేస్ లైన్ సంబంధించిన పూర్తి సమాచారాన్ని హెచ్‌ఎంల నుంచి సేకరించారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మాగనూర్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

మాగనూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎస్సీ బాలుర వసతిగృహంతోపాటు కస్తుర్బాగాంధీ బాలిక విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించి, నాణ్యత పాటించాలని వంట సిబ్బందికి సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామార్థ్యాల పెంపునకు కృషిచేయాలని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

ఊట్కూరు: మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ తనిఖీ చేపట్టారు. హాస్టల్‌లో రికార్డులను, నిత్యవసర సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం వంటలు వండుతున్నారా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, నిత్యవసర సరుకులను పరిశీలించారు. మెనూ ప్రకారం వంటలు వండాలని సూచించారు. వార్డెన్ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ గోవిందరాజులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం వద్ద డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను డీఈఓ గోవిందరాజులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యారంగా అభివృద్ధికి కలిసి పనిచేద్దామని, టెన్త్ పరీక్షల్లో జిల్లాను రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, సీఎంఓ రాజేందర్, యాదయ్యశెట్టి, సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి, సూర్యచంద్ర, హైమావతి, పరందాములు, మౌనిక పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..

నారాయణపేట ఎడ్యుకేషన్: పీఆర్‌టీయూ డైరీని జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఈఓ గోవింద రాజులు ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్, జిల్లా అధ్యక్షుడు వై. జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వెంకట్‌రెడ్డి, రఘువీర్, జనార్దన్ పాల్గొన్నారు.

కోస్గి: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు పలుచోట్ల ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మార్సీలో క్యాలెండర్‌ను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్, ఎంఈఓ శంకర్‌నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఇదేక్రమంలో స్థానిక ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎం శేఖరయ్య ఆవిష్కరించారు. రాజేంద్రబాబు, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, హన్మంతు, సంతోష్, మల్లేష్, అఖిల్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె విరమణ

నారాయణ పేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మున్సిపాల్ పార్క్‌వద్ద 26రోజులుగా కొనసాగిస్తున్న సమ్మె తాత్కాలికంగా విరమించినట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రొఫెసర్ కోదండరాం, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలతో జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు. సమ్మె విరమించి మంగళవారం నుంచి విధుల్లో చేరుతున్నట్లు డీఈఓ గోవిందరాజులుకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అల్తాఫ్, రాజశేఖర్‌గౌడ్, లక్ష్మణ్, రఘువీర్, లక్ష్మీ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ పాలక మండలికి సన్మానం

మక్తల్: వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం నూతనంగా నియమించిన పాలకవర్గం కమిటీ చైర్‌పర్సన్ గవినోళ్ల రాధమ్మ, వైస్ చైర్మన్ గణేష్‌కుమార్ వ్యవసాయపాలక వర్గం డైరెక్టర్లు మహేష్, రంజిత్‌కుమార్‌రెడ్డి, బాలప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్, ఆంజనేయులు, జనార్దన్‌గుప్తా, నాగప్పను నియోజకవర్గ బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి శాలువాతో సన్మానం చేశారు. నాయకులు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని వినతి



ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం విద్యుత్ జిల్లా అధికారి సంజీవరెడ్డికి గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్న గ్రామానికి నాణ్యమైన విద్యుత్ అందడం లేదని, సబ్‌స్టేషన్ పరిధిలో ఏబి స్విచ్‌లు లేక గ్రామానికి విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. అధికారులు స్పందించి గ్రామానికి ప్రత్యేక విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామస్తులు అంజప్ప, ఆశిరెడ్డి, శివశంకర్, అజిత్‌కుమార్, గోవింద్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పీడీఎస్‌యూ నాయకులు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు గౌస్, వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రజా పాలన పేరుతోటి ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వం ఆలోచించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
నారాయణపేట జి. వెంకటేష్ గౌడ్ - 96666 52077
మక్తల్ మహేష్ - 83099 46853
కోస్గి కె. రమేష్ - 99486 98552

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
యాడ్స్ మేనేజర్ 9951602829
జావిద్ : 90109 62007